## క్లుప్తంగా

### కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో తిరుపతిరెడ్డి

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి సమక్షంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రేవంత్ నివాసంలో తిరుపతిరెడ్డి.. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

### బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొడంగల్: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి పార్టీని గెలిపించాలని కొడంగల్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం మున్సిపల్ పరిధిలో పర్యటించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి, మరోసారి ఆదరించాలని కోరారు. ఆయన వెంట శాప్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఎమ్‌సీ వైస్ చైర్మన్ వాణీ యాదవ్, కౌన్సిలర్లు మధుసూదన్‌రావ్ యాదవ్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

### పల్లెల్లో ప్రచార హోరు



ప్రచారంలో ఎంపీపీ తదితరులు

బషీరాబాద్: పల్లెల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రచారం జోరందుకుంది. మండల పరిధి గ్రామాల్లో ఇరు పార్టీల అభ్యర్థులు రోహిత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తరుపున స్థానిక నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. బషీరాబాద్‌లో ఎంపీపీ కరుణ.. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు.

**రేవంత్‌కు మద్దతుగా..**



కొడంగల్: ముస్లింలతో మాట్లాడుతున్న ఎంపీపీ తదితరులు

కొడంగల్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నేతలు కోరారు. శుక్రవారం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ముస్లింలను కలిసి రేవంత్‌కు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, మహ్మద్ యూసుఫ్, నయీమ్, గౌసన్, ఆసీఫ్‌ఖాన్, నందారం ప్రశాంత్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

మొయినాబాద్‌రూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని గండిపేట్ చౌరస్తా చెక్‌పోస్టు స్టాటిక్ సర్వేలివాస్ టీమ్ (ఎస్ఎస్‌టి) ఇన్‌చార్జి గోపాల్ పేర్కొన్నారు. హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని గండిపేట్ చౌరస్తాలో ఆయన తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నామని, వాహనదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపించాలన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా డబ్బులు, ఇతర వస్తువులు రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### కష్టపడే వారికి గుర్తింపు

మొయినాబాద్‌రూరల్: కష్టపడి పనిచేసే వారిని పార్టీ గుర్తిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి అన్నారు. పార్టీ అజీజ్‌నగర్ గ్రామ అధ్యక్షుడిగా మాడి మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డికి జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి పూలమాల వేసి సన్మానించారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

# రాయితీలకు మంగళం

- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి
- వర్షం పడిన ప్రతిసారి నష్టపోతున్న రైతులు
- బహిరంగ మార్కెట్లో టార్పాలిన్లు కొనుగోలు చేస్తున్న వైనం



ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లు (ఫైల్)

దౌల్తాబాద్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామంటున్న ప్రభుత్వం.. అందుకు తిలోదకాలు ఇచ్చేస్తోంది. గత ఐదేళ్లుగా రాయితీ పూర్తిగా నిలిపివేసింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలతో పాటు విత్తనాలు తదితర వాటిపై సబ్సిడీలను ఎత్తివేసింది. నాలుగేళ్లుగా రైతుబంధు, రైతుబీమా మాత్రమే అమలు చేస్తోంది. రైతులు అడపాదడపా రాయితీపై సాగు పనిముట్లు అందజేయాలని కోరుతున్నప్పటికీ వాటి ఊసే లేకుండా పోయింది. సబ్సిడీ నిలిపి వేసిన వాటిలో టార్పాలిన్లు ఒకటిగా చెప్పుకోవచ్చు. వచ్చిన దిగుబడిని అకాల వర్షాల నుంచి కాపాడుకోవటానికి రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం టార్పాలిన్లు అందజేసేది. కానీ గడిచిన కాలంలో సబ్సిడీని నిలిపివేసింది. దీంతో రైతులు చేతికి వచ్చిన దిగుబడిని కోల్పోవాల్సిన దుస్థితి నెలకొంది.

**అకాల వర్షాలు వస్తే..**

ప్రస్తుతం పండించిన పంటలు పలు ప్రాంతాల్లో చేతికి వచ్చాయి. మరికొన్ని గ్రామాల్లో కోతలు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. వారం క్రితం మండలంలో చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో కొంతమేర పంట దెబ్బతిన్నది. సరైన వసతులు లేక పంటను నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే టార్పాలిన్లు నాణ్యతతో ఉంటాయని, ప్రైవేటు వ్యక్తుల నుంచి పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేసినా అవి అనతి కాలంలోనే పాడై పోతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

# నాణ్యమైన విద్యకు తొలిమెట్టు

విద్యార్థులు బాగా చదువుకోవాలి: మండల విద్యాధికారి చంద్రప్ప



కరీంపూర్ పాఠశాలలో విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ

బంట్వారం: తొలిమెట్టుతో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతాయని, విద్యార్థులు పట్టు సాధిస్తారని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన కోట్‌పల్లి మండలం బార్వాద్ తండా, మోత్కుపల్లి, నాగసాన్‌పల్లి, కరీంపూర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గణితం, తెలుగు, ఆంగ్ల సబ్జెక్టులను చదవడం, రాయడంపై ఆయన విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కృత్యాలు తయారు చేయడం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, సీఆర్‌పీ నర్సింహులు పాల్గొన్నారు.

### ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

బొంరాస్‌పేట: ఓటర్లు తమ హక్కును వినియోగించుకోవడానికి ఉపయోగపడే ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని ఎన్నికల నిర్వహణ మండల అధికారి(ఈఆర్‌ఓ), తహసీల్దారు వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీఎల్‌ఓలకు ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను సూచించారు. ఓటర్లకు ఓటరు స్లిప్పులు పంచడంతో పాటు, ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, బీఎల్‌ఓలున్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు



పెద్దేముల్: విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉన్నత లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలి: ఉపాధ్యాయులు

పరిగి: విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఇప్పటి నుంచే ఎంచుకోవాలని, సమాజంలో మనకంటూ తగిన గుర్తింపు రావాలంటే అది చదువుతోనే సాధ్యమని ఉపాధ్యాయులు అన్నారు. మండల పరిధి సయ్యాద్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి, తోటి వారికి పాఠాలు బోధించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువును నిర్లక్ష్యం చేయరాదని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రమేష్, జైపాల్, రామేశ్వరి, హనుమయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

**కుల్కచర్లలో..**

కుల్కచర్ల: చిన్నారులు చదువును నిర్లక్ష్యం చేయరాదని, పాఠ్యాంశాల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. మండల పరిధి బొంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి వారికి పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేష్, ఉపాధ్యాయులు వెంకటయ్య, సూర్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దేముల్‌లో..**

పెద్దేముల్: నేటి బాలలే రేపటి పౌరులు, ప్రతి విద్యార్థి బాగా చదువుకొని, ఉన్నత స్థితికి చేరుకుకోవాలని హెచ్‌ఎం నర్సింహులు ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. తోటి వారికి పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటి చైర్మన్ రాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవిందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రాధ, వెంకటలక్ష్మి, సంగీత, సఫీజ్‌సుల్తాన తదితరులు పాల్గొన్నారు.




పరిగిలో.. విద్యార్థులతో ఉపాధ్యాయులు



కుల్కచర్ల: విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

# బురద చల్లాలని యత్నిస్తే ఊరుకోం

- అవినీతి బట్టబయలు చేస్తా
- మిగులు బడ్జెట్‌ను అప్పుల బడ్జెట్‌గా మార్చారు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి కేటీఆర్‌పై మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ ధ్వజం
- కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అందరికీ మేలన్న నేతలు



ధారూరు: ఎడ్ల బండిపై ప్రచారం చేస్తున్న మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

ధారూరు: 'నేను మంత్రిగా ఉన్నప్పుడు నీ నియోజకవర్గం సిరిసిల్లను వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశాను. బీఆర్ఎస్‌లో చేరాలని ఎన్నోమార్లు డబ్బు ఆశ చూపారు. అయినా ససేమిరా అన్నాను. నా గురించి మీకు అంతా తెలుసు. అలాంటింది నాపై బురద జల్లాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదు. నీ అవినీతి బాగోతం బయటపెడతా' అని మంత్రి కేటీఆర్‌పై మాజీమంత్రి, కాంగ్రెస్ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం మండల పరిధి కేరెళ్లి, కొండాపూర్‌ఖుర్దు, బాచారం, ఎబ్బనూర్, హరిదాస్‌పల్లి, చింతకుంట, రుద్రారం, నాగసమందర్ గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం చేశారు. ఆ తరువాత ప్రసంగించారు. ఆయన మాటల్లోనే 'వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు నిలిచారు. ఆయన గెలిచి బీఆర్ఎస్‌లోనే చేరతారని మంత్రి కేటీఆర్ ఇక్కడ నిర్వహించిన సభలో చెప్పారు. అంటే ఇక్కడ అధికార పార్టీ నుంచి బరిలో ఉన్న ఆనంద్ ఓటమి ఖాయమని ఆయన చెప్పకనే చెప్పారు' అని ప్రసాద్ కుమార్ గుర్తు చేశారు.

**అప్పులే మిగిలాయి..**

కాంగ్రెస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్ చూపిస్తే.. సీఎం కేసీఆర్ రూ.5 లక్షల కోట్ల అప్పులు చూపిస్తున్నారని ప్రసాద్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానని సోనియాగాంధీకి చెప్పి, అధికారం చేపట్టి, పిచ్చికుక్కలా మారాడని విమర్శించారు. తలకు రూ.1.21లక్షల అప్పు ఉందని పేర్కొన్నారు. 104 సంక్షేమ పథకాలతో బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి, అప్పుల పాలు చేశారని మండిపడ్డారు.

**సొంతూరును విస్మరించిన ఆనంద్**

సొంత ఊరుని అభివృద్ధి చేయని ఎమ్మెల్యే ఆనంద్.. నియోజకవర్గానికి ఏం చేస్తారని ఆయన ప్రశ్నించారు. కేరెళ్లిలో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు కేవలం రూ.9 లక్షలు మాత్రమే కేటాయించారు. కానీ పనిచేయించిన సర్పంచ్ నర్సింహారెడ్డికి ఇంత వరకు నయాపైస చెల్లించలేదని వెల్లడించారు. సర్పంచ్ మాత్రం దాతల సహకారంతో రూ.3.50కోట్లతో గ్రామాన్ని తీర్చిదిద్దారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, అధికారంలోకి వస్తే అందరికీ మేలని, చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు బసప్ప, శ్రీనివాస్‌లు, మాజీ జెడ్పీటీసీ రాములు, నాయకులు మల్లారెడ్డి, మహ్మద్ బాబాఖాన్, దయాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఇబ్రాహీం ఉన్నారు.

**బీఆర్ఎస్ నుంచి వలసలు**

మర్పల్లి: ప్రభుత్వ పాలనపై విసుగు చెందిన అధికార బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల పరిధి పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన గులాబీ శ్రేణులు విఠల్, రాజు, గొల్ల రాజు, లక్ష్మీనారాయణ, మల్లయ్యచారీ, లక్ష్మణచారీ, ఆజమల్లి, గౌసొద్దీన్, నర్సింహులు, అంజేయులుగౌడ్‌లు.. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, పార్టీ చేవెళ్ల పార్లమెంట్ సీనియర్ నాయకుడు సుభాష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా.. ప్రసాద్‌కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, గ్రామ కమిటీ యూత్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, భరత్‌రెడ్డి ఉన్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి**

కాంగ్రెస్ హయాంలోనే పిల్లగుండ్ల గ్రామం అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య అన్నారు. పిల్లిగుండ్లలో ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వివరించారు. అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ మేలని, చేతి గుర్తుకు ఓటు వేసి మా నాన్నను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, గ్రామ కమిటి యూత్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, నాయకులు లడ్డు, ఆనందం ఉన్నారు.

### అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే..




ప్రచారం చేస్తున్న నాయకులు

అనంతగిరి: అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సేనని ఆ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ పట్టణం అనంతగిరిపల్లి గ్రామంలో పర్యటించారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారంటీలను అమలు చేస్తామని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల రూ.2,500లతో పాటు, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, కౌన్సిలర్లు మురళి, దేవి రెడ్యా నాయక్, సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, బస్సీలాల్, శేఖర్, పరశురాం, అశోక్ శివానందం తదితరులు పాల్గొన్నారు.

# అదిగో పులి..

- రేగడిమైలారం, చిల్మల్‌మైలారం గ్రామాల్లో ఆనవాళ్లు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు




బొంరాస్‌పేట: పులి సంచరిస్తున్న ప్రచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే విషయమై బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని రేగడిమైలారం, చిల్మల్‌మైలారం గ్రామాల్లో ఆనవాళ్ల గురించి కథలుగా చెప్పుకుంటున్నారు. గురువారం సాయంత్రం బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం శివారు అటవీ ప్రాంతంలో గ్రామానికి చెందిన బంటు శివకుమార్ తన పొలం నుంచి ఎద్దులతో సాయంకాలం వేళలో ఇంటికి వెళ్తుండగా.. దారికి పక్కన కాపుకాసుకొని ఉన్నట్లు గమనించాడు. అది చూసిన శివకుమార్ భయంతో పరుగు తీశాడు. అతని వెంటే కాడెద్లు, పెంపుడు కుక్క పరుగులు తీసి తప్పించుకున్నాయి. అదే రోజు రాత్రి దుద్యాల మండలం చిల్మల్‌మైలారం సమీపంలో కొడంగల్ నుంచి గ్రామానికి చేరుకునే మార్గంలో రోడ్డు దాటుతూ బ్రాహ్మణవారి మామిడితోటలోకి వెళ్లిందని, తాను కారులో కుటుంబ సభ్యులతో వెళ్తూ చూసినట్లు అదే మండలం గౌరారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల ఆనంద్ చెప్పారు. పులి సంచారం వాస్తవమేనని పేర్కొనడంతో పరిసర ప్రాంత ప్రజలు భయానికి లోనవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, పులిని అటవీ ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### విద్యార్థి అదృశ్యం

షాబాద్: ఈతకని వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్ గ్రామానికి చెందిన సొన్నాయిల ఆకాశ్(15) పదో తరగతి చదువుతున్నాడు. ఈతకని వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు మూడు రోజులుగా బంధువుల వద్ద, స్నేహితుల వద్ద వెతికినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. లక్ష్మరావుగూడ పెద్ద క్వారీ గుంత వద్ద అతని చెప్పులు, బైక్ ఉండడంతో ఈతకని వచ్చి అదృశ్యమయ్యాడని కుటుంబీకులు అనుమానిస్తున్నారు.

# అడవి పందుల బెడద

- ఆందోళనలో రైతులు
- పంటను కాపాడాలంటూ వేడుకోలు



పంటను రక్షించుకోవడానికి చుట్టూ చీరలు కట్టిన రైతులు

మొయినాబాద్‌రూరల్: అడవి పందుల బెడద నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతులు చేను చుట్టూ చీరలు కట్టారు. అధికారుల సూచనలు పాటించి తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తున్నా.. రాత్రి వేళల్లో అడవి పందుల బెడద తగ్గడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మండల పరిధిలో అధికంగా వరి సాగు, ఇతర పంటల సాగు చేశారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులకు కంటిమీద కునుకు కరువైంది. అప్పు చేసి, పెట్టుబడులు పెడితే పంట చేతికొచ్చే సమయంలో పందుల పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కనకమామిడి, నక్కలపల్లి, చిన్నమంగళవారం, తోల్‌కట్ట, అమ్డాపూర్, కేతిరెడ్డిపల్లి, ముర్తుజాగూడ, బాకారం ఆయా గ్రామాల్లో అడవి పందులతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు స్పందించి, పందుల బెడదనుంచి తమ పంటలను కాపాడాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# ఘర్ వాపసీ

సొంత గూటికి గంజ్ హమాలీలు



పార్టీలో చేరిన హమాలీలతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు టౌన్: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోయామని తాండూరు గంజ్ హమాలీలు ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం హమాలీలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విధితమే. అయితే వారు ఉన్నట్టుండి శుక్రవారం సొంత గూటికి చేరుకున్నారు. మాలాగే కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు హమాలీలు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి చెప్పారు. దీంతో ఆయన వారికి గులాబీ కండువాలు ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి, నాయకులు శ్రీనివాస చారీ, బంటారం సుధాకర్, ప్రవీణ్ పటేల్ తదితరులు ఉన్నారు.

### నోటుకు ఓటు అమ్ముకోవద్దు

ఇబ్రహీంపట్నం: నోటుకు ఓటు అమ్ముకోవద్దని జైభారత్ చేస్తున్న ఉద్యమం అభినందనీయమని సామాజిక విప్లవ రణభేరి ఎస్సీ పోరాట వేదిక కమిటీ సభ్యుడు నర్సింగ్ అన్నారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికున్నా శవంతో సమానమంటూ ప్రచురించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు ఆవిష్కరించారు.

# మైనింగ్, క్రషర్‌ను నిలిపివేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

కుల్కచర్ల: మైనింగ్, క్రషర్ కర్మాగారాలతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఘణాపూర్ పరిసర ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ మురళీధర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. ఘణాపూర్ గేట్ సమీపంలో కొనసాగుతున్న మైనింగ్ పేలుళ్లతో బండరాళ్లు తమ ఇళ్లపై పడుతున్నాయని పేర్కొన్నారు. ఆ పేలుళ్ల ధాటికి ఇళ్లు, బోరు బావులు దెబ్బతింటున్నాయని, పిల్లలు భయాందోళనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్రషర్ మిషన్ వలన కంకర పౌడర్ పంట పొలాలను కప్పేస్తూ దెబ్బతీస్తుందని, కుంట నీరు కలుషితమై పశువులు రోగాల బారిన పడుతున్నాయని వెల్లడించారు. పర్యావరణానికి, ప్రజలకు ఇంతటి నష్టాన్ని కలిగిస్తున్న మైనింగ్, క్రషర్‌ను మూసివేసి, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, వినోద్ కుమార్, శ్రీశైలం, యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అవినీతి రహిత పాలనే లక్ష్యం

- తాండూరులో కంది బోర్డు ఏర్పాటుకు కృషి
- ఇంటింటి ప్రచారంలో జనసేన అభ్యర్థి శంకర్ గౌడ్



ఇంటింటి ప్రచారంలో శంకర్ గౌడ్ తదితరులు

తాండూరు టౌన్: అవినీతి రహిత పాలనే జనసేన లక్ష్యమని బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి నేమూరి శంకర్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ఇరు పార్టీల నాయకులతో కలిసి స్థానికంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ గాజు గ్లాసు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందుదొందేనని, అవినీతి పాలన కొనసాగించాయని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకుని, తెలంగాణను అప్పుల మయం చేశాయని విమర్శించారు. అలాంటి పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తాండూరులో అనేక సమస్యలున్నా.. పాలకులు పట్టించుకోలేదని, నాపరాయి, సుద్ద వంటి విలువైన ఖనిజ సంపద ఉన్నా, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని పేర్కొన్నారు. జనసేనను గెలిపిస్తే ఇక్కడ కంది బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని, యువతకు స్థానిక కర్మాగారాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు రమేష్ కుమార్, సుదర్శన్ గౌడ్, రజినీకాంత్, రవిపటేల్, రాము, భద్రేశ్వర్, కృష్ణముదిరాజ్, పటేల్ విజయ్, లలిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.